క్లుప్తంగా

ఆర్‌బీకేల్లో పంట నష్టం జాబితాలు

తుని రూరల్: ఇటీవల సంభవించిన మిచాంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న పంట నష్టం జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ఉంచామని ఏడీఏ సుంకర బుల్లిబాబు మంగళవారం తెలిపారు. సబ్ డివిజన్ పరిధి తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 8,987 మంది రైతులకు చెందిన 3473.54 హెక్టార్లలో పంట నష్టం జరిగిందన్నారు. జాబితాలపై అభ్యంతరాలు (సోషల్ ఆడిట్) ఉంటే ఈ నెల 21వ తేదీ సాయంత్రానికి వీఏఏలకు, ఏఓలకు రైతులు తెలియజేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.17వేల చొప్పున ప్రభుత్వం పరిహారం ఇవ్వనుంది.

మహిళలకు కుట్టుమెషీన్ల పంపిణీ

ఏలేశ్వరం: విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం మహిళలకు ఉచితంగా కుట్టుమెషీన్లు పంపిణీ చేశారు. స్థానిక విజయ నర్సింగ్ హోమ్‌లో స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నేతృత్వంలో సుమారు 50 మంది మహిళలకు కుట్టుమెషీన్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించేందుకు కుట్టుమెషీన్లు పంపిణీ చేశామన్నారు. విజయబాబు, స్వర్ణలత, పాల్‌ప్రసాద్ పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

కిర్లంపూడి: కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో జరిగిన అవకతవకలపై పూర్తి విచారణ జరిపించాలని రైతులు ఉన్నత అధికారులను డిమాండ్ చేశారు. తమకు వస్తున్న నోటీసులను నిరసిస్తూ మంగళవారం రైతులు స్థానిక సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గతంలో తీసుకున్న రుణాలను వడ్డీతో సహా కట్టినప్పటికీ బాకీ ఉందంటూ అధికారులు నోటీసులు ఇస్తున్నారన్నారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి పాల్గొన్నారు.

సారా కేసులో ముగ్గురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా, నిందితులతో ప్రత్తిపాడు సెబ్ సీఐ అశోక్

ప్రత్తిపాడు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో – ప్రత్తిపాడు పరిధిలోని కిర్లంపూడి, ఏలేశ్వరం మండలాల్లోని వివిధ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 15 లీటర్ల సారాతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలంలో దాడులు నిర్వహించి, ఐదు సారా కేసుల్లో పరారీలో ఉన్న చెలంకుల వీర్రాజును అదుపులోకి తీసుకున్నారు. కిర్లంపూడి మండలం రామచంద్రాపురం గ్రామంలో పది లీటర్ల సారాతో కోశెట్టి రత్నంను, తామరాడ గ్రామంలో ఐదు లీటర్ల సారాతో బావరపు రవిని అరెస్టు చేశారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. దాడుల్లో ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారని స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

డ్రగ్స్ వాడకంతో దుష్పరిణామాలు

గోకవరం: డ్రగ్స్ వాడకంతో దుష్పరిణామాలు తలెత్తుతాయని కోరుకొండ ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని వీరలంకపల్లి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వలన కలిగే అనర్థాలపై ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వివిధ మత్తు పదార్థాలు, వాటి వలన ఆరోగ్యానికి తలెత్తే హానిని వివరించారు. ప్రిన్సిపాల్ ఎంయూవీ రాణి, ఉపాధ్యాయులు, ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన నిరశన

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన రిలే దీక్షలు 8వ రోజు మంగళవారం కొనసాగాయి. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్వాడీల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాకరాపల్లి సునీత, అల్లాడి లక్ష్మి పాల్గొన్నారు. గ్రామంలో అంగన్వాడీ వర్కర్లు భిక్షాటన చేపట్టి, తమ నిరసనను వ్యక్తం చేశారు.

గోకవరం: పలు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కిర్లంపూడి: కనీస వేతనం చెల్లించాలంటూ అంగన్వాడీ టీచర్లు చేస్తున్న ధర్నా 8వ రోజుకు చేరుకుంది. మంగళవారం స్థానిక బస్‌స్టాండ్ ఎదురుగా ప్రభుత్వానికి నిరసనగా వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు.

యర్రవరంలో ఆందోళన

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రహదారులు పునర్నిర్మించాలని కోరుతూ మంగళవారం ఆందోళన చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. పెంటకోట మోహన్, మేడిశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

సంక్షేమ సారథి మళ్లీ రావాలి

రౌతులపూడి: కుల,మత,వర్గ రాజకీయాలు చూడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను అన్నారు. మండలంలోని శృంగవరంలో 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం వెచ్చించిన కోట్లాది రూపాయల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును స్థానిక సచివాలయం వద్ద ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన రహదారిలోని వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు అన్నీ కొనసాగాలంటే జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సర్పంచ్ ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు గాది రాజుబాబు, పార్టీ నాయకులు యామన సురేష్ బాబు, మానెం వీరబాబు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అన్ని రంగాల్లోను అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు, మండల కన్వీనర్ పంచాది వీరబాబు అన్నారు. మండలంలోని ఇ.గోకవరంలో మంగళవారం ×ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును, ఆ గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోె చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ యూత్ లీడర్ రామిశెట్టి బులిరామకృష్ణ, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు అన్నిక సత్యవతి, పార్టీ సచివాలయ కన్వీనర్లు చందక నాని, అన్నిక సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బెన్నోజు నాగేశ్వరరావు, లొండ బాబు, దేవ లక్ష్మణ్, నేదుళ్ల శ్రీను పాల్గొన్నారు.



ఇగోకవరంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



యర్రయ్యపేటలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన నాయకులు



శృంగవరంలో ప్రభుత్వ పనితీరు వివరిస్తున్న పార్టీ నాయకులు



టి.తిమ్మాపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన నాయకులు

సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే జగన్ మళ్లీ సీఎం కావాలి

తొండంగి: రాష్ట్రంలో నవరత్నాలతో కూడిన సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మంగళవారం మండలంలోని యర్రయ్యపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్య, వైద్యం సేవలను ఎంతో బలోపేతం చేయడంతో పాటు 104, 108 సేవలను సమర్థంగా అందిస్తున్నారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సంక్షేమ లబ్ధి ప్రదర్శన బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాబు రాజు, కొయ్యా మురళి, దడాల విజయ్‌బాబు, తోలాడ శైలా పార్వతి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టి.తిమ్మాపురంలో..

తుని రూరల్: తుని మండలం టి.తిమ్మాపురంలో సర్పంచ్ వరలక్ష్మి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, జేసీఎస్ ఇన్‌చార్జి సకురు నాగేంద్ర నెహ్రూ, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు పాల్గొన్నారు. సచివాలయంలో సంక్షేమ ఫ్లెక్సీ ఆవిష్కరించి, గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వైస్ ఎంపీపీ వివరించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను గెలిపించాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ పాల్గొన్నారు.

దేవదాయ మంత్రికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి



రత్నగిరిపై మంత్రి సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

తొండంగి: అన్నవరం దేవస్థానంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయమని దేవదాయ,ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం రత్నగిరిపై రూ.25 కోట్లతో అభివృద్ధి చేసిన శివసదన్, యాత్రికుల విశ్రాంతి భవనాలు, ఘాట్ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు మంత్రి సత్యనారాయణ దంపతులతోపాటు దేవదాయ కమిషనర్ సత్యనారాయణకు ఘన స్వాగతం పలికారు. పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి శ్రీనివాస మూర్తి వారికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదం అందజేశారు. ట్రస్టుబోర్డు మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఫైనల్‌లో ప్రాతినిథ్యం



హ్యాకథాన్‌లో పాల్గొన్న ఆదిత్య ఇంజినీరింగ్ విద్యార్థులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య కళాశాలల ఐటీ విభాగం విద్యార్థులు బెంగళూర్ న్యూ హరిజన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023 ఫైనల్ పోటీలలో పాల్గొన్నట్టు కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. భారతదేశం అంతటా 47 నోడల్ కేంద్రాలలో ఏకకాలంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తుండగా తమ కళాశాలల విద్యార్థులు ఎస్.శ్రీనువినయ్‌కుమార్, ఏవీ సత్యగంగావేణి, ఎస్.చక్రవర్తి, ఎన్‌బీఎన్ఎస్ గౌతమ్, వై.నిష్కల, పి.సంతోష్ మణికంఠ పాల్గొన్నారన్నారు. మెంటార్‌గా ఏకే చక్రవర్తి వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు స్మార్ట్ ఎడ్యుకేషన్, ఆన్‌లైన్ పర్సనలైజ్డ్ లెర్నింగ్ రికమండేషన్, ట్యూటరింగ్ టూల్, సెర్చ్ ఫర్ బెస్ట్ టీచర్ ఫర్ స్పెసిఫిక్ టాపిక్ అనే అంశాలపై కృషి చేస్తున్నట్టు వివరించారు.

ఈవీఎంలపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: ఓటర్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. ఇ.గోకవరంలో నిర్వహించిన ఈవీఎంలపై అవగాహన కార్యక్రమానికి ఆయన స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణతో కలిసి హాజరయ్యారు. ఓటర్ స్లిప్ జారీ దగ్గర నుంచి ఈవీఎంలో ఓటు వేసే వరకూ తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. వీఆర్వోలు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

వెండి కార్తికేయ విగ్రహం సమర్పణ



కత్తిపూడిలో వెండి కార్తికేయ విగ్రహాన్ని ఆలయ చైర్మన్ గంగాధర్‌కు అందిస్తున్న దాత

శంఖవరం: మండలంలోని కత్తిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకుని అన్నవరం గ్రామానికి చెందిన గండ్రెడ్డి లక్ష్మీప్రసన్న ఆలయానికి వెండి కార్తికేయ విగ్రహం సమర్పించారు. ఆలయ చైర్మన్ గాబు గంగాధర్‌కు స్వామి,అమ్మవారు సన్నిధిలో అందించారు. సుమారు అర కిలో వెండితో విగ్రహం చేయించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ షష్ఠి మహోత్సవాలు 9 రోజులు ప్రజల సహకారంతో వైభవంగా కార్యక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో కేలంగి నూకరాజు,గాబు సూరిబాబు,జీలకర్ర లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వ సభ్య సాధారణ సమావేశం జరగనున్నట్టు ఎంపీపీ చలగళ్ల దొరబాబు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొననున్న ఈ కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించనున్నట్టు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తప్పక ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

పంచాయతీలకు అదనపు ఆదాయమే లక్ష్యం



కోటనందూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బాలమణి

కోటనందూరు: పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ జరగాలని డివిజినల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) బాలమణి ఆదేశించారు. మంగళవారం మండలంలో అల్లిపూడి, కోటనందూరు గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను పంచాయతీ విస్తరణాధికారి జి.అరుణ్‌కుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వర్మికంపోస్టు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. సేకరించిన చెత్తను తడి, పొడిగా విడదీసి రీసైకిల్ చేయాలన్నారు. కేంద్రాల వద్ద ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు రాజా నాగేశ్వరరావు, శ్రీనివాస్, భవానీ, భ్రమరాంబ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సందేహాలు నివృత్తి చేయాలి

ప్రత్తిపాడు: ఓటరు జాబితాపై సందేహాలు నివృత్తి చేయాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఒకటి కంటే ఎక్కువగా ఒకే ఓటరు ఫొటో ఉన్నా, ఓటరు పేర్లు ఒకేలా ఉన్నా వాటిని పరిశీలించాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్ పిటీషన్లను పరిష్కరించాలని పోలింగ్ సూపర్‌వైజర్లను నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ. శ్రీనివాసరావు ఆదేశించారు. ప్రత్తిపాడు, రౌతులపూడి తహసీల్దార్లు పీవీవీ గోపాలకృష్ణ, భీమారావు, ఎన్నికల డీటీ టి.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వివిధ పార్టీల నాయకులు ధరణాలకోట శ్రీను, మదినే బాబ్జి, రొంగల శ్రీనివాసు, పోలింగ్ సూపర్‌వైజర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కనువిందుగా కల్యాణం

గండేపల్లి: తాళ్లూరులో వేంచేసియున్న వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం సోమవారం రాత్రి కనువిందుగా జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన శిష్ట వారి వంశస్తులతో అర్చకులు వీఎస్ఎన్ మూర్తి, తదితర పండింతుల ద్వారా కల్యాణ తంతు జరిపించారు. విద్యుత్ కాంతులు, బాణసంచా, సన్నాయి మేళం భక్తులను ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి రాంబాబు పాల్గొన్నారు.


పాఠశాలకు సోలార్ పవర్ యూనిట్



సోలార్ పవర్ యూనిట్ ప్రారంభిస్తున్న రత్నేష్‌కుమార్

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓఎన్‌జీఎస్ సంస్థ (కాకినాడ) రూ.7.23 లక్షల వ్యయంతో 10 కేవీ సామర్థ్యం గల సోలార్ పవర్ యూనిట్‌ను ఉచితంగా ఏర్పాటు చేసింది. మంగళవారం ఓఎన్‌జీఎస్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ రత్నేష్‌కుమార్ సోలార్ పవర్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం రత్నేష్‌కుమార్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు పూలమాలతో సత్కరించారు. సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, ఉపవిద్యాశాఖ అధికారి డి.సుభద్ర, కొరుప్రోలు సుబ్రహ్మణ్యం, చీఫ్ మేనేజర్ ఆర్.శంకర్, చదలవాడ బాబీ, హెచ్ఎం మునుకుట్ల కళ్యాణ చక్రవర్తి, కుర్ల చినబాబు, పీఎంసీ చైర్మన్ ఆళ్ళ రామశివ, చదరం చంటిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ఎక్కండి.. బహుమతులు పట్టండి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

తుని: ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి బహుమతులు గెలుచుకోవాలని స్థానిక డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శనివారం ప్రకటనలో కోరారు. తుని–నర్సీపట్నం, తుని–కోటనందూరు–కాకినాడ బస్సులలో గిఫ్ట్‌బాక్స్‌లు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణం పూర్తయిన తరువాత టికెట్టు వెనుక చిరునామా, ఫోన్ నంబర్ రాసి గిఫ్ట్‌బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతీ నెల 1, 16వ తేదీల్లో లక్కీ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 16న తీసిన లక్కీడ్రాలో ఎం.వనం బాబు, శ్రీహర్ష, అన్నపూర్ణ, సత్యవతి బహుమతులు గెలుచుకున్నారని డిపో మేనేజర్ వివరించారు.

నేడు సెమీ క్రిస్మస్

జగ్గంపేట: విజయవాడలో బుధవారం జరగనున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు నియోజకవర్గ పాస్టర్లు, క్రైస్తవ సోదరులు తరలిరావాలని ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ కార్యక్రమం సాగుతుందన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని శ్రీ పుష్పయాగ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

తొండంగి: అన్నవరం గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరుని శ్రీపుష్పయాగ మహోత్సవంగా వైభవంగా జరిగింది. స్వామివారి ప్రధానాలయంలో పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆశీనులను చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణ నడుమ శ్రీపుష్పయాగ మహోత్సవాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు కార్యక్రమాన్ని తిలకించారు.

గణితంలో ప్రతిభ

తుని రూరల్: రామానుజన్ గణిత ప్రతిభ పరీక్షలో తమ విద్యార్థులు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ మంగళవారం పేర్కొన్నారు. గత సెప్టెంబర్ 24న మొదట విడత, నవంబర్ 19న రెండో విడత జరిగిన జాతీయ గణిత పోటీ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారన్నారు. ఏడో తరగతి చదువుతున్న మాచినేని అపూర్వ, నాలుగో తరగతి చదువుతున్న ముత్యాల విశ్రుత్‌లు జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు.